పరిచయం

మా ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల ప్రాచ్య భాషా పరిషత్తూ, ఇండియన్ సొసైటీ ఫర్ కామన్ వెల్త్ స్టడీస్ వారి సంయుక్త నేతృత్వంలో **"ఇంగ్లీషు, ప్రాచ్యభాషలు–సాహిత్యాలు: సమస్యలు, సవాళ్ళు"** మీద సదస్సు జరగడం మా కళాశాలకు ఒక గౌరవంగా భావిస్తున్నాం. ఈ సదస్సులో సమర్పించిన మొత్తం 42 పరిశోధనా పత్రాలను స్థూలంగా ఈ క్రింద పేర్కొన్నట్లుగా వింగడించవచ్చు.

వ్యాకరణం

లబ్ధ ప్రతిష్ఠులైన విశ్రాంత ఆచార్యులు వెల్చేరు నారాయణ రావు గారు తాను ఇటీవల రచించిన **తెలుగు దారిని** పరిచయం చేస్తూ రచించిన **ఈ వ్యాకరణం ఎందుకు రాశాను?** అనే వ్యాసం ఈ వ్యాస సంకలనానికి కలికి తురాయి. 'తెలుగు భాషకి ప్రమాణంగా వున్నటువంటి భాష ఇంగ్లీషు అవగానే మనకు తెలుగు భాషా స్వభావం అర్థం కాకుండా పోయింది. ఈ భాష వేరే స్వభావం కలదేమో అన్న ఊహ కూడా మనకి రాలేదు. ఇంగ్లీషు నామవాచకం (Noun) ప్రధానమైన భాష. ప్రతీదీ కూడా నామవాచకంగా మార్చి చెప్పుకోవడం (రాసుకోవడం) మనకు ఇంగ్లీషు వల్ల అబ్బింది. అందుకే మన తెలుగు పత్రికల్లో ఇంగ్లీషు పత్రికల్లో గల శీర్షికల్లాగా ప్రతీదీ నామవాచకంగా మార్చి రాసుకుంటున్నాం. "దొంగ దొరికాడు" అని పత్రికలు శీర్షిక పెట్టడానికి వీల్లేదు. "దొంగ పట్టివేత" అని దాన్ని నామవాచకంగా మార్చి శీర్షిక పెట్టాలి. తెలుగు పత్రికల శీర్షికలన్నీ ఇలాగే వుంటాయి. అందుకని మనం కృతకమైన నామవాచక రూపాలను పత్రికల్లో వాడడం మొదలుపెట్టాం. ఈ వ్యాకరణంలో నేను చేసిన ప్రధానమైన పని ఏమిటంటే తెలుగు క్రియా ప్రధానమైన భాష అని గుర్తించడం' అని తెలుగు వ్యాకరణం తీరు తెన్నులను ఈ వ్యాసంలో ఆచార్య వెల్చేరు నారాయణ రావు గారు సంక్షిప్తంగా తెలియజేసారు.

భాషల తులనాత్మక అధ్యయనం

జి. బాలకృష్ణ తన **"తెలుగు – కన్నడ భాషలలో విభక్తి ప్రత్యయం: తులనాత్మక పరిశీలన"** అనే వ్యాసంలో కీలకమైన వ్యాకరణాంశాలను చర్చించారు. తెలుగులో వలే కన్నడ భాషలో కూడ నామ విభక్తి ప్రత్యయాలు ఏడు రకాలుగా ఉన్నాయని తెలియజేస్తూ ఈ వ్యాసంలో సోదర భాషలైన తెలుగు – కన్నడ భాషలలోని విభక్తి ప్రత్యయాల గురించి వ్యాసకర్త తులనాత్మక పరిశీలన చేసారు. ఇదే కోవలో ఎ. రామాంజనేయులు, **"తెలుగులో తులనాత్మక పరిశీలనలు – భాషా పరమైన సవాళ్ళు"** అనే వ్యాసంలో తులనాత్మక సాహిత్య పరిశోధనా వైశిష్ట్యం, ఆవశ్యకతలను చర్చించారు. రామ కథను వర్ణించిన వివిధ రామాయణ కావ్యాల్లో సారూప్యతలు, వైరుధ్యాలు ఇందులో చర్చకు వచ్చాయి.

హెచ్. గంగ రాజు **"హిందూపురం తెలుగు మీద కన్నడ భాషా ప్రభావం – నామరూప నిర్మాణం"** అనే వ్యాస రచన చేశారు. ఈ ప్రాంతంలో కన్నడ, తెలుగు భాషలు వ్యవహారంలో సుమారుగా ఒకే రకమైన ధ్వని పరిణామాలు పొందడం వలన సమాన రూపాలు సంతరించుకోవడం కనిపిస్తుంది. దీనికి ఈ రెండు భాషలు పరస్పరం చూపుకున్న ప్రభావం కారణం కావచ్చు అని భావిస్తూ మహతీ, మహతీతర, కృదంత, తద్ధిత స్వరూపాల మీద తాను చేసిన పరిశోధనను ఈ వ్యాసంలో రచయిత వివరించారు. డాక్టర్ జడా సుబ్బారావు **"వర్తమాన సమాజాన్ని చిత్రించిన నవలేఖన కన్నడ కథలు"** ను సమీక్షించారు. కన్నడంలో పద్నాలుగుమంది యువ కథకులు రాసిన పద్నాలుగు కథలను 'నవలేఖన కన్నడ కథలు' అనే పేరుతో 2017లో నేషనల్ బుక్ ట్రస్ట్

ఆఫ్ ఇండియా ప్రచురించింది. ఈ కథాసంకలనానికి ఎస్. జి. సిద్ధరామయ్య సంపాదకులుగా వ్యవహరించారు. ఈ కథలను తెలుగులోకి రంగనాథ రామచంద్రరావు అనువదించారు. వాటి విశ్లేషణను ఈ వ్యాసంలో వ్యాసకర్త చేపట్టారు.

స్త్రీ వాదం

నోసిన వెంకటేశ్వర్లు రచించిన వ్యాసం **"తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం"** ప్రాచీన అర్వాచిన మహిళా విదుషీ మణుల సాహితీ వ్యవసాయాన్ని విశ్లేషించింది. **"వలివేటి నాగ చంద్రావతి కథల్లో కోడలి పాత్ర చిత్రణ"** వ్యాసంలో వొడుగురు సంపత్ కుమార్ ఈ కథానికలను సమర్థవంతంగా సమీక్షించారు. **"జానపద గేయాలలో నలుగు పాటలు – స్త్రీల విశిష్టత"** వ్యాసంలో అంకే సురేష్ కుమార్ 'ప్రేయసిగా గృహలక్ష్మిగా చెల్లిగా తల్లిగా వీరనారిగా ఎన్నో రూపాల్లో ఆజన్మాంతం ప్రతిఘట్టం లోనూ తన ఉనికిని గౌరవప్రదంగా కాపాడుకుంటూ వస్తున్న స్త్రీ మూర్తే మన సాంప్రదాయ రక్షణ కవచం' అని చెప్పడం సముచితంగా ఉంది. 'అనంతపురం జిల్లాలో జానపద స్త్రీల హృదయాంతరాళాల నుంచి విరజిమ్ముతూ బయటకు వస్తున్న' జోల పాటలు, ఉయ్యాల పాటలు, మంగళహారతి పాటలు, నలుగు పాటలు, వాకిలి పాటలు, అప్ప గింతల పాటలు మొదలైన జానపద గీతాలను వీరు చర్చించారు.

"స్వాతంత్ర్యానంతర స్త్రీలసాహిత్యంలో స్త్రీల స్వేచ్ఛాస్వాతంత్ర్యాల" ను డాక్టర్ జంధ్యాల కనకదుర్గ సమీక్షించారు. 'జనాభాలో సగభాగం స్త్రీలు కాబట్టి స్త్రీల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు సంబంధించిన విషయాలే ఎక్కువగా స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. అయితే స్త్రీల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు సామాజిక, ఆర్థిక–రాజకీయ స్వభావం కలిగిన వ్యవస్థకు సంబంధం ఉంటుంది. కాబట్టి ఆయా సందర్భాలలో ఈ వ్యవస్థ స్పష్టమవుతూనే ఉంటుంది. స్త్రీల స్వేచ్ఛకు స్వాతంత్ర్యానికి ఆటంకప్రాయమైన విషయాలు స్త్రీలు రాసిన సాహిత్యం లో ఎక్కువగా ప్రతిఫలించటం సహజం' అని పరిశోధకురాలు అభిప్రాయపడ్డారు. ఇందులో రంగనాయకమ్మ, వోల్గాలతో పాటు, నల్లూరి రుక్మిణి, యలమర్తి అనురాధ, కుప్పిలి పద్మ, కొండవీటి సత్యవతి, గీతాంజలి తదితరుల రచనలను ఈమె ప్రస్తావించారు.

షేక్ జరీనా **"స్త్రీ అస్తిత్వాన్ని చిత్రించిన ఎమ్వీ రామిరెడ్డి కథల"** ను సమీక్షించారు. డాక్టర్ పొనుగోటి రవికుమార్ **"దళిత కవిత్వంలో స్త్రీ పురాణ ప్రతీకలు"** అనే తన వ్యాసంలో అనేకానేక ప్రతిపాదనలు చేస్తూ 'స్త్రీలను పురుషాధిక్య సమాజం ఎలా తమ చెప్పుచేతుల్లో పెట్టుకుందో పతివ్రత కథలే సాక్ష్యం' అని అభిప్రాయపడ్డారు. సుమతి, కుష్ఠ వ్యాధిగ్రస్తుడై నడవలేని స్థితిలో ఉన్న భర్తను గంపలో కూర్చోబెట్టుకొని తలపై మోస్తుండేది. తన భర్త ఆజ్ఞమేరకు వేశ్యాసంపర్కం కోసం కూడా తీసుకుపోతుంది. పతివ్రత కథలలో స్త్రీకి ఎటువంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవు. భర్త చేతిలో కీలుబొమ్మగా ఉండడం కోసం ఈ కథలను సృష్టించారని వేరే చెప్ప నక్కర లేదు అంటారు వ్యాసకర్త.

సి. హెచ్. సాయికృష్ణ, **"భారతీయ సాహిత్యంలో స్త్రీలు – స్త్రీవాద విమర్శ"** ను విశ్లేషించారు. ఆది నుండి నేటిదాకా తెలుగు సాహిత్యంలో స్త్రీని చిత్రీకరించిన పోకడలను రచయిత ఇందులో ప్రస్తావించారు. ఈ వ్యాసంలో స్త్రీ వాదం పాత్ర గురించి వ్యాసకర్త 'ఈ విధంగా సమాజంలో, సాహిత్యంలో స్త్రీల పట్ల కొనసాగుతున్న వివక్ష, శారీరక హింస, మానసిక హింస, అణచివేత, హక్కుల ఉల్లంఘన, కులహింస మొదలగు వానినన్నింటిని స్త్రీవాద సాహిత్యం తన భుజాన వేసుకుంది. మొత్తం సామాజిక క్రమంలో ఎక్కడా స్త్రీకి స్థానం కానీ, విలువ కానీ లేకపోవడాన్ని స్త్రీవాద సాహిత్యం ఒక ప్రశ్నగా చేసి సమాజం ముందు నిలబెట్టి స్త్రీ చైతన్యానికి కారణమైనదని చెప్పవచ్చు' అని వ్యాసకర్త అభిప్రాయ పడ్డారు.

పర్యావరణం

గంగవరపు అశోక్ రాజు **"ధర్మవరపు చాముండేశ్వరి గారి పర్యావరణ కథలు–విశ్లేషణ"** గావించారు. మన చుట్టూ ఉండే పంచభూతాలైన నింగి, నేల, నీరు, నిప్పు, గాలి ద్వారా మనకు లభించే వనరులు, మనం ఉపయోగించే వస్తువులే పర్యావరణమని పాఠశాల స్థాయి బాలలకు అర్థమయ్యేలా ఈ కథలు తెలుపుతాయని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. అదేవిధంగా మానవుల చిన్న చిన్న తప్పుల వలన నీరు, గాలి కలుషితమవుతాయని, తద్వారా దోమలు పెరుగుతాయని; ఆ దోమ కాటు వలన డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన మానవులు పడతారని వివరిస్తూ, దోమకాటు నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి పరిసరాలను శుభ్రపరచుకోవలసిన అవసరాన్ని ఈ కథలు వివరిస్తాయని కూడా వ్యాసకర్త తెలిపారు.

ఇలాటిదే మరొక వ్యాసం డాక్టర్ కట్టెపోగు రత్న శేఖర్ **"పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను కాపాడుకోవడంలో వచ్చిన కవితలు–పరిశీలన"**. 'అక్షర వృక్షాలు' అనే కవితా సంచికలోని సుద్దాల అశోక తేజ, శిఖామణి, ఎండ్లూరి సుధాకర్, జె. బాపురెడ్డి, వడ్డేపల్లి కృష్ణ, జయంపు కృష్ణ మొదలగు కవుల కవితలను రచయిత ఈ వ్యాసంలో పరిశీలించారు. డాక్టర్ నందిగామ నిర్మల కుమారి **"సాహిత్య యవనిక : పర్యావరణ స్పృహ"** వ్యాసం కూడా ఈ కోవకు చెందినదే. ఇందులో వ్యాసకర్త తెలుగు నాట భావ కవిత్వ ఛాయ ప్రధానంగా వచ్చిన ప్రకృతి, ప్రాకృతిక అంశాల మేళవింపులను నింపుకుని వచ్చిన రచనలను సమీక్షించారు. ప్రముఖ భావ కవి కృష్ణ శాస్త్రి ప్రకృతితో మమేకమై రాసిన అనేక గేయాలు, కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పుష్ప విలాపం, రాయప్రోలు సుబ్బారావు గారి లలిత, వెంకట పార్వతీశం కవుల జలజ మాలిక, కాళ్ళకూరి నారాయణ రావు గారి స్నానఘట్టము, దువ్వూరి రామిరెడ్డి గారి కడపటి వీడ్కోలు, అబ్బూరి రామకృ ష్ణారావు గారి మల్లికాంబ, కట్టమంచి రామలింగారెడ్డి గారి నవయామిని, ముసలమ్మ మరణం, మరొక ప్రసిద్ధ తెలుగు "చెట్టుకవి" ఇస్మాయిల్ కూడా పర్యావరణ స్పృహతో రచించిన కవిత్వాల పరామర్శ ఈ వ్యాసంలో కనిపిస్తుంది. కవిత్వం గేయ సాహిత్యం, కథలు, నవలలు మొదలగు సాహిత్య ప్రక్రియలు పర్యావరణ స్పృహతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసాయని వ్యాసకర్త తేటతెల్లం చేసారు.

గిరిజన సాహిత్యం

డాక్టర్ బాసాని సీతారాములు **"అంతరించిపోతున్న గిరిజన భాషలు"** ను సమీక్షిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో మాతృ భాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, మరోప్రక్క అమెరికన్ సామ్రాజ్య వాద సంస్కృతి తాకిడిలకు బలవుతున్న మాతృ భాషలు కనుమరుగవక తప్పని పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోయ, గోండి తదితర గిరిజన భాషల పరిరక్షణకు తెలుగు రాష్ట్రాలు చేస్తున్న కృషిని కూడా రచయిత ఈ వ్యాసంలో వివరించారు.

డాక్టర్ ముసుగు శ్రీనివాస రావు **"చెంచుల మౌఖిక, గేయ సాహిత్యం – పరిశీలన"** అనే వ్యాసంలో చెంచులు ఆయా సందర్భాలలో పండుగలలో పనులు చేసుకొనే సమయంలో తమవైన తేలికైన పదాలతో అల్లుకునే పాటలు ద్వారా వారి ఆలోచనా రీతిని ప్రతిబింబిస్తూ ఎక్కడా అతిశయోక్తి కానీ, కృతకం కానీ లేకుండా వారి సుఖదు:ఖాలను, సమకాలీన సంఘటనలు కలిగించిన తమ ఆంతరంగిక భావాలను పాటల ద్వారా వ్యక్తపరుస్తారని పేర్కొన్నారు. ధనావత్ శాంతి **"నల్గొండ జిల్లాలోని లంబాడీ (గిరిజనుల) పాటలు – పరిశీలన"** అనే వ్యాసంలో

లంబాడీ / సుగాలీ ప్రజల గిరిజన సాహిత్యాన్ని విశ్లేషించారు. శబ్ద ఉత్పత్తి, పర్యాయపదాలు తదితర సాహిత్య అంశాలతో పాటు లంబాడీల సామాజిక నేపథ్యాన్ని కూడా రచయిత ఈ వ్యాసంలో పరిశీలించారు.

డాక్టర్ చింతల రాకేశ్ భవాని **"భారతదేశ భాషావైవిధ్యం: సమస్యలు-పరిష్కారాలు"** వ్యాసంలో ఈ విషయంపై విస్తృతమైన విశ్లేషణ గావించారు. 'వివిధ ప్రాంతాలలో మాట్లాడుతున్న స్థానిక భాషలకు, గిరిజనులు మాట్లాడే లిపి లేని భాషలకు ప్రమాదం దాపురించింది. అయితే మాతృ భాష పరిరక్షణ పేరుతో ఆయా రాష్ట్రాలలో ఎక్కువమంది మాట్లాడే భాషలకే ప్రాధాన్యమిస్తున్నారు. ఉదాహరణకు తెలుగునాట తెలుగును కాపాడుకోవాలన్న తపన ఉంది. అలాగే తెలుగు ప్రాంతాలలో ఉండే విభిన్న ఆదివాసీ సమూహాలకు కూడా వారి తల్లిభాషలను కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఉంటుందని గుర్తించాలి. కనుక వారి వ్యవహారాలు, చదువులు వారి భాషల్లో కొనసాగడానికి అనువుగా ప్రభుత్వాలు చొరవ చూపాలి. అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. విద్యా సంస్థలలో విదేశీ భాషలే గాక అల్ప సంఖ్యాకుల భాషలను ఆప్షనల్గా తీసుకోడానికి ప్రోత్సహించాలి. ఇందుకోసం సిలబస్‌ను తయారు చేసుకోవాలి. పుస్తకాలు రూపొందించాలి. తెలుగునాట ప్రధానంగా తెలుగు, ఉర్దూ, అరబిక్ తప్ప ఇతర స్థానిక భాషలకు తగిన ప్రాధాన్యం లేదు. తెలుగు నేల మీద విభిన్న ప్రాంతాల్లో వివిధ భాషలు మాట్లాడేవారు ఉన్నారు. వారి భాషలను తాము కూడా నేర్చుకోవాలన్న తపనను విద్యార్థుల్లో ప్రోది చేయాలి.' అని సూచించారు.

తెలుగు క్రైస్తవ సాహిత్యం

డాక్టర్ బేతపూడి సుబ్బారావు **"ప్రపంచ సాహిత్య చరిత్రలో తెలుగు క్రైస్తవ సాహిత్యం"** అనే సమీక్షా వ్యాసంలో క్రైస్తవ గేయ సాహిత్య సొబగులను ఆవిష్కరించగా, ఇదే ఒరవడిలో **"తెలుగు భాషా సాహిత్యాలకు పాశ్చాత్య క్రైస్తవ మిషనరీల సేవ"** అనే వ్యాసంలో డాక్టర్ దాసరి కృపారావు క్రైస్తవ మిషనరీలు చేసిన తెలుగు సాహిత్య సేవతో పాటు వారు తెచ్చిన సామాజిక చైతన్యాన్ని, సంస్కరణలను అభివర్ణించారు. అలానే శ్రీమతి కూచిపూడి శాంత కుమారి **"క్రైస్తవ సంకీర్తన కవయిత్రి కొమ్ము కృప"** సాహిత్య కృషిని వివరించారు.

ప్రపంచీకరణ

డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ, **"ప్రపంచీకరణలో తెలుగు భాషా మాధ్యమం"** పాత్రను విశ్లేషిస్తూ భాషా సవాళ్ల విషయంలో సరైన దిశలో భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, ముఖ్యంగా ఒక వేదిక మీద ఏదో ఒక అంశంపై మాట్లాడేటప్పుడు ఆ అంశానికి సంబంధించిన పలు గ్రంథాలను గూగుల్ లాంటి మార్గాల ద్వారా సేకరించి తగిన రీతిలో లక్ష్యాలను సాధించినప్పుడు సాంస్కృతిక సంభాషణ సమర్థవంతంగా ఉంటుందని సూచించారు. డాక్టర్ కె. సురేశ్ కుమార్ **"ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు బంధుత్వ పదాలు- ఆంగ్లప్రభావం"** వ్యాసంలో తెలుగులోని బంధుత్వ పదాలు కనుమరుగవుతున్న తీరును వివరించారు.

బూర్ల వేంకటేశ్వర్లు **"జూకంటి జగన్నాథం కవిత్వంలో ప్రపంచీకరణ పరిణామాలు"** అనే వ్యాసంలో గ్లోబలైజేషన్ తెచ్చి పెట్టిన ముప్పు పట్టణాల్లో బతుకుతున్న వారి జీవితాల్లో చిచ్చు రగిలించిందని, గ్లోబలైజేషన్ కి సమాధానం స్థానికత అన్న స్పృహ పాదుకుంది అని వివరించారు. తమ స్థానిక మూలాల్ని కాపాడుకోవడం ద్వారా గ్లోబలైజేషన్ వల్ల వాటిల్లుతున్న ముప్పును ఎదుర్కోవడం అవసరమన్న అవగాహనను ఈ వ్యాసం కలిగిస్తుంది. స్థూలంగా చూచినప్పుడు గ్లోబలైజేషన్ నేపథ్యంలో ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వానికి ప్రాధాన్యం పెరిగింది. తమ స్థానిక సంస్కృతుల పరిరక్షణ గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటంలో ప్రధానభాగమైంది. అందులో భాగంగానే భాషకు సంబంధించిన శృంఖలాలను కూడా తెలంగాణ కవులు తెంచుకున్నారు, అని అభిప్రాయపడ్డారు.

గుగులోత్ తిరుపతి తన వ్యాసం **"వాల్మీకి రామాయణం పాత్రల ఔచిత్యం"** లో 'వాల్మీకి రామాయణంలో రామ కథను మహాకావ్యంగా రూపొందిస్తున్న వేళ ఆదికవి వాల్మీకి కొన్ని పాత్రల్ని అసమగ్రంగా వదిలివేశాడు, అందుకు కారణం వాటిని సమగ్రంగా చిత్రించడం రూపుకట్టించడం ఆయన కావ్య ప్రణాళికకు అవసరం లేకపోవడం; అందువలన వాల్మీకి మహర్షి కాబట్టి ఆ పాత్రలపై మమకారాలు పెట్టుకోలేదు' అని చెబుతూ రామాయణ మహాకావ్యంలో ఉదాహరణగా మంథర తదితర పాత్రల చిత్రణం గురించి వ్యాఖ్యానించారు.

తెలుగు భాషా బోధన

డాక్టర్ ఆర్. శ్రీనివాసరావు **"తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాషకు ఎదురవుతున్న సమస్యలు–సవాళ్ళు"** వ్యాసంలో 'తెలుగు భాష నేటి ఆధునిక కాలంలో ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను తెలపటమే ఈ వ్యాసోద్దేశ్యం' గా చెప్పారు. తెలుగు మాతృ భాషగా ఉన్నవారు మాతృ భాష తెలుగులో విద్యాబోధనకు ఉన్న శాస్త్రీయతనీ, ఉద్యోగం, నిరుద్యోగాలు అమలులో ఉన్న ఈ పెట్టుబడీదారీ ఆర్థిక వ్యవస్థకూ ఉన్న బలమైన బంధాన్ని అర్థం చేసుకోవాలి. ఎలాంటి అహాలకు పోకుండా ఇంగ్లీషులో కనీస పరిజ్ఞానాన్ని విద్యార్థులు పొందేలా ప్రోత్స హించగలగాలి', అని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, తెలుగు **"భాషాబోధన – శాస్త్రీయ విధానం"** పై సమగ్ర వ్యాసం సమర్పించారు.

డాక్టర్ ఆర్. రవీంద్ర భాస్ తెలుగులో భాషా బోధన సాధక బాధకాలను వివరిస్తూ **"భాషను బోధిస్తున్నామా? బాధిస్తున్నామా?"** అనే వ్యాసంలో భాషా బోధకుడు విద్యార్థుల దృక్పథంలో మార్పు తెచ్చేలా బోధన చేయగలిగి ఉండాలని, భాషా బోధన లక్ష్యం కూడా అదే అని అభిప్రాయపడ్డారు. ఇంతే కాక భాషను బోధించే ఉపాధ్యాయుడు ఆ భాషా తత్వం తెలుసుకుని ఉండాలని, ఆ భాష వివిధ సందర్భాలలో ఎలా ఉపయోగపడుతుందో అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులు భాషను అభ్యసించటంలో ఎదురవుతున్న ఇబ్బందులు గ్రహించి వారు సులభంగా దానిని ఎలా నేర్చుకోగలరో అలా వారికి నేర్పగలగాలి అని అభిప్రాయం వ్యక్తంచేస్తూ భాషా బోధనా పాలసీ గురించి సూచనలు చేశారు.

ఇలాంటిదే ఆత్మకూరి ప్రశాంత్ వ్యాసం **"తెలుగు బోధనాపద్ధతులు, విధానాలు, మెలకువలు".** ఈ వ్యాసంలో కొన్ని బోధనాపద్ధతులను–ముఖ్యంగా అక్షర పద్ధతి, పదపద్ధతి, పూర్ణపద్ధతి, క్రీడాపద్ధతి, నియోజనాల పద్ధతి, ప్రాజెక్టు పద్ధతి, కృత్యాధార పద్ధతి, కథాకథన పద్ధతి, నాటకీకరణ పద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, ఉపన్యాస పద్ధతి, ఖండపద్ధతి, పద్య పఠన పద్ధతి, ప్రతిపదార్థ పద్ధతి, ప్రశంసాపద్ధతి, నిగమన మరియు ఆగమన పద్ధతులు అనే తెలుగుభాషలోని వివిధ వైవిధ్య విశిష్ట పద్ధతులను రచయిత వివరించారు. ఈ పద్ధతులన్నింటినీ తరగతిగదిలో ఉపయోగించి బోధనసాగించినట్లయితే భాషాభివృద్ధి సక్రమంగా జరుగుతుంది అని వ్యాసకర్త అభిప్రాయం. అలానే **"జాతీయ విద్యావిధానం (ఎన్.ఇ.పి. 2020) – మాతృ భాష, భారతీయ భాషల ప్రాముఖ్యత"** వ్యాసంలో పి. మధువని, NEP 2020 విధివిధానాలను వివరించారు.

మా చరిత్ర అధ్యాపకులు డాక్టర్ మూరే విజయకుమార్ రెడ్డి, డాక్టర్ బండి కళ్యాణి తమ **"అభ్యసన ఆధారిత బోధన"** అనే వ్యాసంలో అభ్యసన ప్రక్రియ లక్షణాలను, ప్రక్రియలను అందులోని సోపానాలను వివరించారు. డాక్టర్ టి. జాన్ కిరణ్ బాబు, భారత ప్రభుత్వం 2020 నూతన విద్యా విధానం మరియు NAAC Reaccreditation Framework లో నొక్కి వక్కాణిస్తున్న Student Centric Methods మౌలికభావనల ఆధారంగా

"డిగ్రీ స్థాయి తెలుగు భాషా సాహిత్యాల బోధనలో భాగంగా విద్యార్థులకు ఆచరణాత్మక పరిశోధనా దిశా నిర్దేశనం – మార్గదర్శనం" అనే వ్యాసంలో విలువైన సూచనలు చేశారు.

"తెలుగు" తక్కువ వారికి ఏది ఉత్తమమైన భాష? అనే విశ్లేషక వ్యాసంలో ఉన్నవ గణేశ్ 'తెలుగు చాలామంది మాట్లాడకపోవటానికి ప్రధాన కారణాలలో ఒకటి తెలుగు ఉచ్చారణ కష్టంగా ఉండటం. తెలుగు భాషను సరిగ్గా పలకాలి అంటే 72 నాడుల సహకారం కావాలి. ఇతర భాషలకు నాలుక పలుచగా ఉంటే చాలు. తెలుగు, సంస్కృతాలు పలకాలంటే మాత్రం దేహం చాలా బలిష్టంగా ఉండాలి. శ్వాస మీద పట్టు ఉండాలి. నేటి విద్యార్థులకు వీటి మీద అవగాహన లేదు కాబట్టి తెలుగును దూరం పెట్టి ఆంగ్లాన్ని అక్కున చేర్చుకుంటున్నారు' అని అభిప్రాయపడ్డారు. ఇక ఉత్తమమైన భాష ఏది అంటే ఎప్పటికైనా, మన మాతృ భాషే మనకి ఉత్తమమైన భాష. 'తల్లిని మించిన దైవం లేదు. మన తల్లి భాషను మించిన భాషలేదు.' వందల సంవత్సరాలు విద్య నేర్చినా మన భాషలోనే మనకి పట్టు లభించాలి. అప్పుడే ఇతరభాషల్లో మనం పరిపక్వత సాధించగలం' అని వ్యాసకర్త అభిప్రాయం.

డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ **"తెలుగు బోధన, అభ్యసన – కొన్ని లక్ష్యాలు"** అనే వ్యాసం కూడా ఈ కోవకు చెందినదే. 'తెలుగు బోధనలో నేడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తెలుగుభాషా సాహిత్యాలపట్ల గౌరవాదరాలు తగ్గడం. అభ్యసనంలో విద్యార్థుల ప్రధాన సమస్యలు ఉచ్చారణ, లేఖనం. అందరూ పూనుకొని దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ప్రయత్నిస్తే ఈ సమస్యలను పరిష్క రించవచ్చు. అలాగే భాషావిధానం, అనువాద విధానం, నిఘంటు విధానం అనే మూడు పటిష్ఠమైన విధానాలను ఏర్పాటు చేసుకొని కృషి చేస్తే తెలుగు భాషాసాహిత్యాలు అటు విజ్ఞానాన్నీ, ఇటు ఉపాధినీ కల్పిస్తాయనడంలో సందేహం లేదు' అని వ్యాసకర్త అభిప్రాయ పడ్డారు.

పి. నాగ చందన వ్యాసం **"భారతదేశంలో బహుభాషత్వం – ప్రస్తుత పరిస్థితులకు అన్వయం"** లో 'సామాజికాంశాలే నా రచనలకు ప్రేరణ. మాతృ భాష సంపూర్ణంగా వచ్చిన వారు ఇతర భాషలలో అలవోకగా ప్రావీణ్యం సంపాదించగలరు. పాఠం బోధించేటప్పుడు తెలుగైతే దానికి ఆంగ్లంలో అర్థము, ఆంగ్లమైతే తెలుగులో అర్థం చెప్పటం వల్ల సంపూర్ణ జ్ఞానం విద్యార్థులకు అందుతుంది. ఏక కాలంలో మూడు భాషలను నేర్పించటం అనే పరిశోధన అంశాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే నా ఆశయం యీ సంగోష్ఠి ద్వారా నెరవేరింది' అని వ్యాసకర్త పేర్కొన్నారు.

స్థూలంగా తెలుగు భాష, సాహిత్య పరిశోధనలను సమీక్షిస్తూ **"తెలుగు భాషా సాహిత్య వికాసానికి కృషి చేసిన భాషావేత్తలు"** వ్యాసాన్ని డాక్టర్ కె. ధనశ్రీ, రచించారు. 'తెలుగుభాషపై పరమ ప్రామాణికంగా శాస్త్రీయ పద్ధతిలో విశిష్టమైన కృషి చేసిన పాశ్చాత్యులు మరియు ప్రాశ్చాత్యులు అని మనం గుర్తించుకోవాలి' అని రచయిత్రి అభిప్రాయపడ్డారు.

'తెలుగు సాహిత్యంలో ప్రాచీన కాలంలో పద్యంలో రచనలు జరిగేవి. ఆధునిక సాహిత్యంలో వచనంలో రచనలు జరుగుతున్నాయి. ప్రాచీన సాహిత్యంలో ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పదకవిత, ద్విపద, దండకం, ఉదాహరణ, శతకం, వచనం, చిత్రకవిత, కథాకావ్యం, దండకం, ద్వ్య ర్థికావ్యం, అచ్చ తెనుగుకావ్యం, యక్షగానం, హరికథ, బుర్రకథ, చాటువు, అవధానం, జానపద కవిత మొదలయినవి ఉండేవి. ఆధునిక సాహిత్యంలోకి పాశ్చాత్య భాషల సాహిత్య ప్రభావంతో కొత్త కొత్త ధోరణులు, ఉద్యమాలు ప్రవేశించాయి. ఆంగ్ల భాషా ప్రభావంతో నవల, కథ, గల్పికలు, నాటకం, ఏకాంకిక, పాట, ఖండకావ్యం, వ్యాసం, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, యాత్రా

చరిత్ర, పీఠిక, గ్రంథ సమీక్ష, విమర్శ , లేఖాసాహిత్యం, అనువాదం వంటి ప్రక్రియలు తెలుగులోకి ప్రవేశించాయి. ఉర్దూ భాష ప్రభావంతో గజల్, రుబాయిలు కూడా తెలుగులోకి వచ్చాయి' అనే వివరాలనునిస్తూ **"తెలుగులో నూతన ప్రక్రియ వ్యంజకాలు"** అనే శీర్షిక గల తన వ్యాసంలో డాక్టర్ యస్. జ్యోత్స్నారాణి సామాజిక, మానవతా, ఆధ్యాత్మిక, చమత్కార, సాంస్కృతిక, దేశభక్తి ఇత్యాది వ్యంజకాలను సమీక్షించారు.

డాక్టర్ కె.వి.యస్.డి. వరప్రసాద్ **"గ్రామ నామాలు – భాషాసంబంధమైన పరిశోధన– ఆవశ్యకత"** అనే తన పరిశోధనా వ్యాసంలో తెలుగునాడులో వ్యుత్పత్తి పరిణామ క్రమం ప్రకారం స్థిరపడిన గ్రామ నామాలు, వాటి నేపథ్యాలను చిత్రీకరించారు. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రచించిన వ్యాసం **"భాషాభివృద్ధి వ్యూహంగా పద్య గణితం"** గురించి వివరిస్తున్నది. ఇందులో శ్లోకాలతో ఆల్‌జీబ్రా, కటపయాది పద్ధతి, పద్యాలతో భాగాహారం మొదలైన ప్రక్రియలను వ్యాసకర్త ప్రస్తావించారు. అనువాద కళ గురించి ప్రచురితమైన వ్యాసం **"అనువాద విద్య: అనువాద సమస్యలు".** వ్యాసకర్త భారతీయ భాషల కేంద్రీయ సంస్థ జాతీయ అనువాద సమితి ఆచార్యులు డాక్టర్ ప్రత్తిపాటి మాథ్యు. విషయానికి అనుగుణంగానే ఇది ద్విభాషా వ్యాసం.

మా ఆంధ్ర లొయోల కళాశాల ప్రాచ్యభాషల శాఖాధిపతి డాక్టర్ కోలా శేఖర్ **"మంచి తెలుగు రాసేందుకు ఏం చేయాలి?"** అనే లఘు వ్యాసంలో అనుసరణీయమైన సూచనలు చేశారు. 'చాట్ జి.పి.టి. చాట్ (చాటింగ్ – వలలో పాఠ్యం మాధ్యమంగా సంభాషించుకునే పద్ధతి) జెనెరేటివ్ ప్రి–ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ కు సంక్షిప్త రూపం. ఈ మధ్య చాట్‌జిపిటి ని అందరూ వాడుకునేందుకు వీలుగా ఈ పనిముట్టును తయారు చేసిన ఓపెన్‌ఏఐ సంస్థ దీనిని నవంబర్ 30, 2022న విడుదల చేసి జనబాహుళ్యంలోకి chat.openai.com లంకె ద్వారా అందుబాటులో ఉంచింది. ఇది మొదటి అయిదు రోజుల్లో పది లక్షల వాడుకరులను నమోదు చేసుకొని అంతకు ముందు వేరే ఏ సాఫ్టవేర్ అందుకోని ఘనతను అందుకుంద'ని విప్లవాత్మక సాధనమైన **చాట్ జి.పి.టి. పరిచయం** లో రహ్మానుద్దీన్ షేక్ పేర్కొన్నారు. ఈ సంకలనానికి ఇది చక్కని భరతవాక్యం లాంటిది.

ఈ విధంగా భాషా శాస్త్రం, తెలుగు భాషా బోధనాంశాలు, జానపద గేయ సాహిత్యం, కథానికలు, స్త్రీ సాహిత్యం, గిరిజనుల వాఙ్మయం, అనువాదం, తదితర సవాళ్ళు కొన్ని ఈ సంకలనం వ్యాసాల్లో కూలంకష చర్చకు వచ్చాయి. ఈ సంకలనం నిస్సందేహంగా ఆంధ్ర వాణికి మరొక మనోహర మణిమకుటం. పదిమందికి పైగా స్త్రీ వ్యాసకర్తలు, మైనారిటీ వర్గాలకు చెందిన సాహితీ వేత్తలు ఈ సంపుటిలో దర్శనమివ్వడం ముదవహం. ఇంతటి విస్తృత పరిధిలో తమ పరిశోధక పత్రాలను సమర్పించిన వారందరికి హృదయపూర్వక వందనాలు.

"భాగవత రామాయణ గీతాది శ్రుతి శాస్త్ర పురాణపు మర్మములను శివాది సన్మతముల గూఢములన్ ముప్పది ముక్కోటి సురాంతరంగముల భావంబులనెరిగి భావ రాగ లయాది సౌఖ్యముచే చిరాయువుల్గలిగి నిరవధి సుఖాత్ములైన..." వారెందరో మహానుభావులుండగా ఈ వ్యాస సంపుటిని పరిచయం చేసే మహద్భాగ్యం నాకు లభించడం మా కళాశాలకు ఉన్న ప్రఖ్యాతే కారణమని సవినయంగా భావిస్తూ, ఈ చదువుల తల్లి పరుల కొరకు జీవించే నరులనుగా తన బిడ్డలను తీర్చి దిద్దుతూ దేవ, దేశ సేవలలో మరింత ముందుకు సాగేలా దేవుడు దీవించాలని ప్రార్థిస్తున్నాను.

డా॥ ఫాదర్ గుజ్జుల అంతోని పీటర్ కిశోర్
ప్రాచార్యులు
ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల
విజయవాడ – 520 008